## క్లుప్తంగా

### సబ్‌కలెక్టర్‌ను కలిసిన తహసీల్దార్



సబ్‌కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న తహసీల్దార్

ఆదోని రూరల్: గొనెగండ్ల నూతన తహసీల్దార్ పి.రాజేశ్వరి బుధవారం ఆదోనిలోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ తహసీల్దార్ రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

### అధిక ఫీజులను అరికట్టాలి

ఆదోని సెంట్రల్: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో అధిక ఫీజులను అరికట్టాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణ, ఖాజా అన్నారు. బుధవారం వారు ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాల అధిక ఫీజుల దోపిడీపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నా యకులు రఘు, మోహన్, శేషు, వీరేష్ పాల్గొన్నారు.

### తాగునీరు అందించండి

ఆదోని రూరల్: మండలంలోని సంతెకుడ్లూరు గ్రామానికి తాగునీటిని అందించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) గ్రామ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలోని పంప్‌హౌస్‌ను పరిశీలించారు. కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి బి.తిక్కప్ప, గ్రామ అధ్యక్ష కార్యదర్శి పరమేష్, సిద్ధప్ప మాట్లాడుతూ గ్రామాల్లో 20 రోజులవుతున్నా తాగునీరు అందించే నాథుడే లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ గ్రామ కమిటీ సభ్యులు రాము, గుండయ్య, ఏలియా, వీరేష్, లాజుర్ తదితరులు పాల్గొన్నారు.

### పదోన్నతి పొందిన లలితమ్మకు సన్మానం



సన్మాన చేస్తున్న వైద్య సిబ్బంది

ఆదోని టౌన్: ఆదోని టీబీ యూనిట్‌లో సూపర్‌వైజర్‌గా సేవలందించిన లలితమ్మ పీహెచ్ఓగా పదోన్నతి పొంది అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. బుధవారం స్థానిక టీబీ యూనిట్ ఆవరణలో వైద్య సిబ్బంది ఆమెకు సన్మానం చేసి, ఆమె సేవలను కొనియాడారు. మెడికల్ ఆఫీసర్ షేకున్‌బాను లలితమ్మ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ స్వరూప్ రాజ్‌కుమార్, వైద్య సిబ్బంది శ్రీధర్, భాస్కర్, పద్మావతి, సుబ్బమ్మభాయి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

**బదిలీపై ఉద్యోగికి వీడ్కోలు**

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టులో పనిచేస్తున్న సీనియర్ క్లర్క్ శంకర్ బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం స్థానిక కార్యాలయంలో వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ ఆయనను సత్కరించారు.

### డిప్యూటీ తహసీల్దార్‌గా రఘువీర్



గోనెగండ్ల: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా రఘువీర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. పత్తికొండ మండలంలో పనిచేస్తున్న ఆయన బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీటీగా పనిచేస్తున్న విష్ణుప్రసాద్ బదిలీపై కల్లూరుకు వెళ్లారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది ఆయనను పూలమాలతో సత్కరించారు.

### దరఖాస్తుల ఆహ్వానం

గోనెగండ్ల: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ షాహినా పర్వీన్ బుధవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఏపీ మోడల్ స్కూల్‌లో 7, 8, 9వ తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లకు అర్హులైన విద్యార్థులు ఈనెల 20వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఈనెల 24న స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లోనే ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

### కొనసాగుతున్న దీక్షలు

ఎమ్మిగనూరుటౌన్: తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని స్థానిక మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎం.నారాయణ డిమాండ్ చేశారు. ము న్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక దీక్ష బుధవారానికి 36వ రోజుకు చేరుకుంది.

### నూతన పింఛన్ల మంజూరు

మంత్రాలయం రూరల్ : మండల పరిధిలో 74 కొత్త పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ..మండలంలో 74 నూతన పింఛన్లకు గాను రూ.2,96,000 మంజూరయ్యాని వివరించారు. కొత్త పింఛన్లను ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో గురువారం పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

# బడికి వేళాయె.. సౌకర్యాలు లేవాయె!

- నేడు పాఠశాలల పునఃప్రారంభం
- ఇంకా పాఠశాలలకు చేరుకోని విద్యార్థుల యునిఫాం, బ్యాగ్‌లు, బూట్లు
- గత ప్రభుత్వ పాలనలో పాఠశాలలు తెరిచిన రోజే విద్యాకానుక కిట్ల పంపిణీ
- ఏడాదైనా పూర్తికాని నాడు–నేడు రెండవ విడత పనులు





పట్టణంలోని ఎంఎస్ జెడ్పీ హైస్కూల్‌లో పిల్లర్లకే పరిమితమైన నాడు–నేడు పనులు, తరగతి గదుల కొరతతో ఒకే గదిలో ఇరుకుగా కూర్చున్న విద్యార్థినులు(ఫైల్)

ఎమ్మిగనూరుటౌన్: వేసవి సెలవులను సంతోషంగా గడిపిన విద్యార్థులు గురువారం నుంచి భుజాన బ్యాగులు తగిలించుకొని బడిబాట పట్టేందుకు సిద్ధమయ్యారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు పాఠశాలలు ప్రారంభమైనరోజే విద్యాకానుక పేరుతో కిట్ అందించేది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వపాలనలో నేటికీ పాఠశాలలకు పూర్తి స్థాయి లో పుస్తకాలు, విద్యా సామగ్రి అందలేదు. అలాగే గత ప్రభుత్వం చేపట్టిన నాడు–నేడు పనులు నిధు లు మంజూరు చేయకపోవడంతో పూర్తి కాలేదు.

**పూర్తికాని తరగతి గదుల నిర్మాణాలు..**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలను కల్పించి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దింది. ఎమ్మిగనూరు పట్టణంతో పాటు మండలంలో నాడు–నేడు కింద మొదటి విడతలో 32 స్కూళ్లలో తరగతి గదులు ఇతర మౌలిక సదుపాయాలు పూర్తి చేశారు. అదేవిధంగా రెండవ విడత గత ప్రభుత్వ హయాంలో 77 పాఠశాలల్లో నిర్మాణాలు జరిగినా ఎన్నికల కారణంగా కేటాయించిన నిధుల్లో 40శాతం నిలిచిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా రెండో విడత నాడు–నేడు కింద మిగిలిపోయిన పనులను మాత్రం పూర్తి చేయలేకపోయింది. దీంతో తరగతి గదుల కొరతతో విద్యాబోధనకు ఇబ్బందిగా ఉంటుందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**గత ప్రభుత్వంలో తొలిరోజే పంపిణీ**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభించేలోగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లు, బూట్లు, యునిఫాం, బెల్ట్ తదితర సామగ్రితో కూడిన కిట్లను పాఠశాలలకు చేర్చి విద్యార్థులకు మొదటి రోజే అందించింది. అయితే ప్రస్తుతం అధికారంలో వున్న కూటమి ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. ఎమ్మిగనూరు పట్టణం, మండలంలో మొత్తం 88 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 22488 మంది విద్యార్థులకు 1,07,399 పాఠ్యపుస్తకాలు వచ్చాయి. మిగతా సామగ్రి బెల్టు, షూ, బ్యాగులు తదితరాలు ఏవీ రాలేదు. గోనెగండ్ల మండలంలో 55 పాఠశాలలు 10470 మంది విద్యార్థులు ఉండగా 62వేల పుస్తకాలు వచ్చాయి ఇంకా 8 నుంచి 10వేల దాకా రావాల్సి ఉంది.అలాగే డిక్షనరీలు,బెల్టులు రాగా, యూనిఫాం, షూ, బ్యాగులు రావాల్సి ఉంది. నందవరంలో 43 స్కూళ్లు 9468 మంది విద్యార్థులు చదువుతుండగా36230 పుస్తకాలు వచ్చాయి. యూనిఫాం, బెల్టులు, బ్యాగ్స్, షూ రావాల్సి ఉంది. విద్యార్థుల స్కూల్ యునిఫాంలు, స్కూల్ బ్యాగులు, బూట్లు నేటికీ చేరలేదు. కేవలం పాఠ్యపుస్తకాలు మాత్రమే పాఠశాలలకు చేర్చారే తప్ప మిగిలినవేవి పంపిణీ చేయలేకపోయింది. దీంతో పేదల విద్యకు ప్రభుత్వం ప్రోత్సాహిస్తుందా లేదా అన్న అనుమానాలను విద్యార్థుల తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు.

### నాడు–నేడు పనులు పూర్తి చేయాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు కింద మొదటి విడత పనులన్నీ పూర్తి చేసింది. పాఠశాలలు తెరిచే నాటికి పాఠ్యపుస్తకాలతో సహా అన్ని విద్యార్థులకు ఇచ్చేది. అయితే నాడు–నేడు రెండవ విడత పనులను కూటమి ప్రభుత్వం నేటికీ పూర్తి చేయకపోవడం దారుణం. ఇంత వరకూ పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, స్కూల్‌యునిఫాం, బ్యాగులు, బెల్టులు పాఠశాలలకు చేర్చకపోవడం సమంజసం కాదు.

– బలరాం యాదవ్, వైఎస్సార్ స్టూడెంట్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు

### విద్యా వ్యవస్థపై నిర్లక్ష్యం తగదు



విద్యావ్యవస్థ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వహించడం తగదు. పాఠశాలల వేసవి సెలవులు ముగిసినా నేటికీ స్కూల్ యునిఫాం, బూట్లు, బ్యాగులు ఇవ్వకపోవడం దారుణం. పాఠ్యపుస్తకాలు పూర్తి స్థాయిలో విద్యార్థులకు అందించాలి.

– శేఖర్‌నాయుడు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు

### పాఠ్యపుస్తకాలు పాఠశాలకు చేర్చాం



మండలంలో అన్ని పాఠశాలలకు 1,07,399 పాఠ్య పుస్తకాలను చేర్చడం జరిగింది. తొలిరోజు అవి విద్యార్థులకు పంపిణీ చేయడం జరుగుతుంది. యునిఫాం, బ్యాగులు, బూట్లు వచ్చిన వెంటనే పంపిణీ చేస్తాం. నిధులు మంజూరైతే నాడు–నేడు కింద చేపట్టిన పనులను కూడా పూర్తి చేస్తాం.

– మధుసుదన్‌రావు,ఎంఈఓ 2 ,ఎమ్మిగనూరు

### అప్రమత్తంగా ఉండండి

కౌతాళం: రాబోవు ఐదు ఆరు రోజుల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు రజినీకాంత్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాబోవు ఐదు ఆరు రోజుల పాటు భారీ వర్షాలతో పాటు ఉరుములు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు. ఈ విషయంపై కౌతాళంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో దండోరా వేయిస్తున్నట్లు తెలిపారు.

### చుక్క నీరు వృథాకాకుండా చేస్తాం

ఆదోని అర్బన్: ఎల్ఎల్‌సీ కాలువలోని నీటిని ఒక్క చుక్క నీరు కూడా వృథా కాకుండా చూస్తామని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. బుధవారం ఆదోని మండలం బసాపురం గ్రామం వద్ద ఉన్న ఎల్ఎల్‌సీ కాలువలో జరుగుతున్న లైనింగ్ పనులను పరిశీలించారు. కాంట్రాక్టర్ సృజన్, డీఈ బాషాను పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీబీ డ్యాం నుంచి దిగువ కాలువ పనులకు గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతిపాదనలు పంపారని తెలిపారు. ఈ మేరకు 23 కి.మీ. వరకు గత నెల 5వ తేదీ నుంచి లైనింగ్ పనులు ప్రారంభమయ్యాయన్నారు.

### ఇంటి స్థలాల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్

పెద్దకడబూరు : పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చేందుకు స్థలాన్ని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సమీపంలో కల్లుకుంట గ్రామ రోడ్డుకు పక్కన ఉన్న స్థలంలో ఇంటి పట్టాల కోసం 22మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వారిలో 17మందిని అర్హులుగా గుర్తించామన్నారు. తహసీల్దారు గీతాప్రియదర్శి, ఆర్ఐ జెర్మియా, తహసీల్దారు సిబ్బంది పాల్గొన్నారు.

# రెడ్ బుక్ రాజ్యాంగానికి పతనం తప్పదు



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కన్వీనర్ కేవీ కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు

గోనెగండ్ల : వచ్చే స్థానిక, సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగానికి పతనం తప్పదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేవీ కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రం గోనెగండ్లలోని ఎమ్మిగనూరు రోడ్డులో వైఎస్సార్‌సీపీ నూతన కార్యాలయాన్ని పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ముందుగా నూతన కార్యాలయంలో వీరశైవమఠం పీఠాధిపతి శివయ్యస్వామిచే పూజలు చేయించారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. కేవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కూటమి ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడుతున్నారని చెప్పారు. దీనికి చంద్రబాబు నాయుడు సమాధానం చెప్పాలన్నారు. కక్షలు మాని సంక్షేమంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మురళీనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకురాలు అరుణ రెడ్డి, ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు చికెన్ రాజా, అల్లబకాష్, మన్సూర్, కాశీరెడ్డి, భాస్కర్ రెడ్డి, దొరబాబు, పెద్దిరెడ్డి, ఉరుకుంద రెడ్డి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

### పచ్చిరొట్టతో భూసారం పెంపు

పెద్దకడబూరు : రైతులు పచ్చిరొట్ట ఎరువులతో భూసారాన్ని పెంచుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మి అన్నారు. కృషి విజ్ఞాన్ కేంద్రం బనవాసి వారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలో బుధవారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భూసారం పెంచుకోవడానికి పచ్చిరొట్ట ఎరువులతో సేంద్రియ కర్బనం పెంచుకోవాలని వివరించారు. ఐఐఎంఆర్ శాస్త్రవేత్త సంగప్ప, కేవీకే సమన్వయకర్త డాక్టర్ కె.రాఘవేంద్రచౌదరి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త కిషోర్ కుమార్ రైతులకు పలు సూచనలు చేశారు. ఏఓ ఎం.వరప్రసాద్, ఆత్మ బీటీఎం మారుతి యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్‌షాక్‌కు గురై యువకుడి మృతి

ఆదోని అర్బన్: మండలంలోని కపటి గ్రామానికి చెందిన ఈరన్న, లక్ష్మి దంపతుల కుమారుడు సూరి(15) అనే యువకుడు విద్యుత్‌షాక్‌కు గురై బుధవారం మృతిచెందాడు. ఇస్వీ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఈరన్న, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు సంతానం. మృతుడు సూరి చివరి సంతానం. బుధవారం ఏరువాక పౌర్ణమి ఉండడంతో ఎద్దుల కొమ్ములకు కలర్ వేసి పక్కకు వచ్చి షెడ్‌కు సపోర్టుగా ఉన్న యాంగ్లర్‌ను తాకాడు. ఆ యాంగ్లర్‌కు విద్యుత్ సరఫరా ఉండడంతో విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాడు. పక్కనున్న బంధువులు షాక్‌కు గురైన సూరిని తప్పించి ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని, పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇస్వీ పోలీసులు తెలిపారు.


**వాహనం ఢీకొని ..**

ఆదోని అర్బన్: మండలంలోని పెద్దహరివాణం గ్రామానికి చెందిన కురువ వీరేష్(26) గురువారం గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఇస్వీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దహరివాణం గ్రామానికి చెందిన ఈరమ్మ, కురువ వీరేష్ ఆదోని మండలం నారాయణపురం గ్రామంలో పెళ్లి చేసుకున్నాడు. ఐదు నెలల క్రితం మృతుడి భార్య పల్లవి కాన్పు అయ్యిందని, భార్య, పిల్లలను చూడడానికి మృతుడు బైకుపై నారాయణపురం వెళ్తుండగా పెద్దహరివాణం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

**హత్యాయత్నం**

ఆదోని అర్బన్: పట్టణంలోని వాల్మీకి నగర్‌కు చెందిన ఆంజనేయపై హత్యాయత్నం జరిగిందని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఆంజనేయ ఇంటి సమీపంలో నరసప్ప, వెంకటేష్ గతంలో పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని ఆంజనేయపై కత్తితో హత్యాయత్నంకు పాల్పడ్డాడన్నారు. ఆంజనేయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

# బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ నరేష్ బాబు

గోనెగండ్ల: ఎస్‌బీఐ అందించే వివిధ రకాల రుణాలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గోనెగండ్ల ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ నరేష్ బాబు తెలిపారు. బుధవారం గోనెగండ్ల ఎస్‌బీఐ బ్యాంకు ఆవరణలో వ్యవసాయ రుణాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకులో క్రాప్‌లోన్ తీసుకున్న రైతులు సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలన్నారు. అలాగే ఖరీఫ్ సీజన్ ఆరంభమైనందున రైతులకు కొత్తగా క్రాప్ లోన్లు, మార్టిగేజ్ లోన్లు ఇస్తున్నట్లు తెలిపారు. మొండి బాకీలు ఉన్న వారు ఓటీఎస్ పద్ధతి( వన్ టైం సెటిల్‌మెంట్) ద్వారా వీలైనంత త్వరగా సెటిల్‌మెంట్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కౌసల్య, ఫీల్డ్ ఆఫీసర్లు జాకబ్, మధు మనోహర్, రాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్య లేకుండా చూస్తాం



ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్

ఆదోని టౌన్: ప్రజలకు విద్యుత్ సమస్య లేకుండా చూస్తామని మున్సిపల్ కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్ అన్నారు. బుధవారం వార్డుల పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కాజీగడ్డ, ఎన్టీఆర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీల్లో గత కొన్ని సంవత్సరాలుగా త్రీఫేస్ విద్యుత్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. ఓల్టేజీ కారణంగా ఫ్రిడ్జ్‌లు, మోటార్లు, ఇతర ఎలక్ట్రిక్ పరికరాలు సరిగా పనిచేసేవి కాదన్నారు. ఈ విషయంపై సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి వార్డుల్లో మొదటి దశ కింద ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయించి విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో కాలనీవాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

# ‘ఏరువాక’.. రంకెలేయగా!



పెద్దతుంబళంలో పారువేటను తిలకిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్



ముగతిలో వృషభాల పారువేట

మంత్రాలయం : రైతుల పర్వ దినం ఏరువాక సంబరాలు ఊరూర వైభవంగా జరిగాయి. బుధవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా వేడుకలు కనుల పండువగా సాగాయి. వేడుకల్లో భాగంగా రైతులు కాడెద్దులకు స్నానాలు చేయించి రంగులతో అలంకరించి నైవేద్యాలతో విశేష పూజలు గావించారు. అలాగే గ్రామ తోరణాల పారువేటలో ఎద్దులను రంకెలు వేయించారు. గ్రామ చావిడిల్లో తోరణాలను తెంచి గ్రామస్తులకు కనువిందు చేశారు. మంత్రాలయం మండల కేంద్రంలో కూరగాయల మార్కెట్‌లో ఎద్దుల పారువేట పోటీలు కనుల పండువగా సాగాయి. సర్పంచు తెల్లబండ్ల భీమయ్య నేతృత్వంలో పారువేట కార్యక్రమానికి బారీకేట్లు ఏర్పాటు చేసి చూపరులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో జరిగిన ఏరువాక పౌర్ణమి వేడుకల్లో గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు సాయంత్రం సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ పాల్గొన్నారు. వృషభాల పారువేట కార్యక్రమాన్ని తిలకించారు. అంతకుముందు సబ్‌కలెక్టర్ గ్రామంలోని జైన్ దేవాలయం, రామాలయాలను దర్శించుకున్నారు.

**ఎద్దుల పరుగుపందెం**

కోసిగి : కోసిగిలోని సిద్దప్ప పాళెం, కడా పాళెం వీధులలో ఎద్దుల పారువేట వేడుకలను నిర్వహించారు. ఇందులో సిద్దప్ప పాళెంలో జెక్కనగేని గోవిందు, కడాపాళెంలో తమ్మనగేని గోపాలు, గోవిదు రైతులకు చెందిన ఎద్దులు గెలుపొందాయి. గెలుపొందిన ఎద్దులను ఊరేగించారు.

**ఊరూర ఏరువాక పండుగ**

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లతో పాటు పలు గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి పండుగను బుధవారం వైభవంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో గద్వాల గేరి, మొట్టివీధి, అచ్చుకట్ల గేరి, లక్ష్మిపేట, చాకలి వీధి, కురువ పేట ప్రాంతాల్లో ఎద్దుల పారువేట కార్యక్రమం చేపట్టారు. అలాగే ఆయా గ్రామాల్లో పారువేట కార్యక్రమాన్ని నిర్వహించారు.

**యువతకు పరుగుల పోటీలు**

పెద్దకడబూరు : మండల పరిధిలోని ముచ్చగిరి గ్రామంలో 4కిలోమీటర్ల పరుగు పందెంలో రాఘవేంద్ర మొదటి స్థానంలో నిలవగా, రెండో స్థానంలో రామలింగ అనే యువకుడు నిలిచాడు. పెద్దకడబూరు మండల కేంద్రంలో 6కిలోమీటర్ల పరుగు పందెంలో మల్లికార్జున మొదటి స్థానంలో నిలిచి ఔరా అనిపించుకున్నారు.



మంత్రాలయంలో ఎద్దుల పారువేటలో రైతులు

**వృషభాల ఊరేగింపు**

నందవరం: జొహరాపురం గ్రామంలో రైతులు బసవన్నలకు నది స్నానాలు చేయించి ప్రత్యేకాలంకరణ గావించి పూజలు చేపట్టారు. ఇబ్రహీంపురం, నదికైరవాడి, ముగతి గ్రామంలో ఏరువాక పౌర్ణమి వేడుకల్లో భాగంగా వృషభాల పారువేట నిర్వహించారు. పారువేటలో గెలుపొందిన వృషభాల రైతన్నలకు బహుమతులు అందజేశారు.

**బసవన్నల ఊరేగింపు**

కౌతాళం: మండల పరిధిలోని హల్వి, ఓబుళాపురం, నదిచాగి, డమ్ములదిన్నె, బదినేహాల్, లక్ష్మినగర్ గ్రామాలలో ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా లక్ష్మినగర్‌లో యువకులు ఇసుక బస్తాల ఎత్తుట, గుండు ఎత్తు పందెలాను నిర్వహించారు.



బదినేహాల్‌లో వైఎస్సార్‌సీపీ జెండాతో వృషభం

**చేరగని వైఎస్సార్‌సీపీ ముద్ర**

వైఎస్సార్‌సీపీ అంటేనే ప్రజల్లో చేరగని ముద్ర ఉంది. వృషభాలకు ఏరువాక పౌర్ణమి సందర్భంగా బదినేహాల గ్రామంలో కొంతమంది రైతులు వృషభాల కొమ్ములకు వైఎస్సార్‌సీ పార్టీ జెండా కట్టి తమ అభిమాన్ని చాటుకున్నారు.

### వైభవంగా బాబాఫరీద్ గంధోత్సవం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని సిరాలదొడ్డి సబ్–స్టేషన్ సమీపంలో వెలసిన బాబా ఫరీద్ గంధోత్సవం కేఎస్ఎస్‌బీ నూర్‌బాబా, కేఎస్ఎస్‌బీ ఖాదర్‌బాబా స్వాముల ఆధ్వర్యంలో జరిగాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజామున వరకు గంధం వేడుక అనంతరం సాయంత్రం ఉరుసు మహోత్సవం ఘనంగా జరిగింది. రాత్రింతా ప్రముఖులచే ప్రసంగం, ఖవాలీ ఏర్పాటు చేశారు. వేడుకల్లో బాబాఫరీద్ కుమారుడు కేఎస్ఎస్‌బీ సర్ఫ్‌రాజ్‌బాబా, కమిటీ సభ్యులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

### గుర్తు తెలియని వ్యక్తి బలవన్మరణం

మంత్రాలయం రూరల్ : మంత్రాలయం మండలం, తుంగభద్ర రైల్వేస్టేషన్ సమీపంలోని ఆదాని వీల్ మార్ ఆయిల్ ఫ్యాక్టరీ కంచెను ఆనుకుని ఉన్న ఓ చెట్టుకు ఉరి వేసుకుని గుర్తు తెలియని వ్యక్తి ప్రాణాలు తీసుకున్నాడు. మృతిడి వయస్సు దాదాపు 30 నుంచి 35 ఏళ్లు ఉండవచ్చని పోలీసులు చెబుతున్నారు. మృతుడు బుడిద రంగు జీన్స్ ప్యాంట్, బ్రౌన్ కల్లర్ టీషర్టు ధరించి ఉన్నాడు. ఎఫ్ గెర్ అక్షరాలు ఉన్న కాలేజీ బ్యాగ్ సంఘటన స్థలంలో ఉంది. శరీరంపై ఎలాంటి రక్తగాయాలు లేవు. మృతిడి చిరునామాకు సంబంధించి సంఘటనా స్థలంలో ఎలాంటి ఆధారాలు లభించ లేదు. కాచాపురం వీఆర్వో టి. పుష్పాలత వివరాల మేరకు కేసు నమోదు చేసుకుని దార్యాప్తు చేపట్టినట్లు మాధవరం పోలీసులు తెలిపారు.